కొనుగోలు కేంద్రాలను పటిష్టం చేయాలి

కందుకూరు, అక్టోబరు 11: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన పరికరాలను సమకూర్చుకోవాలని జిల్లా సహకార సంఘం అధికారి(సూపరింటెండెంట్) సుధాకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయంలోని యూరియా బస్తాలను పరిశీలించారు. రైతులకు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు.అనంతరం అధికారులను మండల సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు. డైరెక్టర్ పొట్టి ఆనంద్, కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి, సిబ్బంది కె.మహేష్, శంకరి పర్వతాలు, మంచాల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయీభవ

- నేడే విజయదశమి
- జిల్లాలో దసరా సందడి
- వేడుకలకు ఏర్పాట్లు



చేవెళ్లలో రావణ దహనానికి ఏర్పాట్లు

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 11 : తెలంగాణలో ముఖ్యమైన పండగ దసరా. ఈ పండగను చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకుంటారు. ఇందుకోసం జిల్లా వాసులు సిద్ధమయ్యారు. శుక్రవారం పూజా సామగ్రి కొనుగోలు చేయడంలో జనం బిజీబిజీగా ఉన్నారు. దీంతో మార్కెట్లు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి.

నిమజ్జనానికి సిద్ధం

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆశ్వయుజ పౌడ్యమి నుంచి ఆశ్వయుజ శుద్ధ నవమి వరకు తొమ్మిది రోజుల పాటు తొమ్మిది రూపాల్లో దుర్గామాతను పూజించి పదో రోజు అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు భక్తులు రెడీ అయ్యారు. అదేవిధంగా వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పూజలు చేసేందుకు సిద్ధమయ్యారు. నరకాసుర వధ నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు. సాయంత్రం ఆలయాల సమీపంలో జమ్మిచెట్టు వద్ద శమీ పూజ నిర్వహిస్తారు. అనంతరం జమ్మిఆకును ఒకరికొకరు ఇచ్చుకొని దసరా పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

అందరూ ఆనందంగా ఉండాలి : కలెక్టర్



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలకు కలెక్టర్ శశాంక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకలను ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ పండగ నేపథ్యంలో ప్రజలంతా విజయాలు పొందాలని, చేపట్టిన ప్రతీ కార్యం సఫలీకృతం కావాలని కోరుకున్నారు.

ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి



శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి

ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు అని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ పండగ రోజు నుంచి ప్రతీ ఒక్కరు విజయాలు పొందాలని, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అమ్మవారి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, దుర్గామాత కరుణాకటాక్షాలతో అన్ని వర్గాల వారు సుభిక్షంగా ఉండాలన్నారు.

కనుల పండువగా గరుడ సేవ



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

చేవెళ్ల, అక్టోబరు 11 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో దసరా పండగ నేపథ్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదో రోజు శుక్రవారం స్వామివారికి గరుడ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడారు. శనివారం ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ ధర్మకర్తలు దేవుని వామనాచార్యులు, పూజారులు తెలిపారు.

షాద్‌నగర్‌ను అభివృద్ధి చేసి చూపిస్తా

నియోజకవర్గంలో చేయాల్సిన పనులన్నీ పూర్తి చేస్తా

- ఈ ప్రాంతం అంటే ఎంతో ఇష్టం
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెనుకబడిన విద్యారంగం
- లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును నిర్మించకుండా నిధులు దోచేసిన కేసీఆర్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన





సభకు హాజరైన జనం

రంగారెడ్డి అర్బన్/షాద్‌నగర్/చౌదరిగూడ, అక్టోబరు 11 : షాద్‌నగర్ అభివృద్ధి బాధ్యత తనదేనని, ఈ నియోజకవర్గంలో చేయాల్సిన పనులన్నీ పూర్తి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కొందుర్గు మండల కేంద్రంలో రూ.120 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శుక్రవారం సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నియోజవర్గ అభివృద్ధి కోసం తయారు చేసిన జాబితా చాలా పెద్దదిగా ఉందని.. ప్రస్తుతం దానిని చదవలేనని, ఇంటికి వెళ్లాక తప్పకుండా పరిశీలిస్తానని అన్నారు. షాద్‌నగర్ అంటే తనకు ప్రేమ అని... ఎమ్మెల్యే ఇచ్చిన జాబితా ప్రకారం ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రజకుడైన వీర్లపల్లికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చానని, షాద్‌నగర్ ప్రజల ఆశీర్వాదంతో విజయం అందించారని అన్నారు. అతనికి ఓటేస్తే.. తనకు వేసినట్లేనని తెలిపారు. 'వీర్లపల్లి'ని ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్‌ను చేశానని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో షాద్‌నగర్ ప్రాంతం విద్యారంగంలో ఎంతో వెనుకబడిందన్నారు. కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలని ఎమ్మెల్యే పట్టుబట్టాడని, అంతటితో ఆగకుండా తనను ఇక్కడికి తీసుకువచ్చారని తెలిపారు. సొంత నియోజకవర్గం కొడంగల్‌లో స్కూల్ శంకుస్థాపనకు వెళ్లాల్సి ఉన్నా అక్కడికి వెళ్లలేదని, కొందుర్గు మండలానికి రావడం జరిగిందని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును గత సీఎం నిర్మించకుండా నిధులు దోచుకున్నారని ఆరోపించారు.

షాద్‌నగర్‌కు మెడికల్ కాలేజీ ఇవ్వండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్‌కు మెడికల్ కాలేజీ ఇవ్వాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎంను కోరారు. అలాగే షాద్‌నగర్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా వంద ఫీట్ల రోడ్డు విస్తరణ చేపట్టేందుకు నిర్ణయించినట్లు, ఇందుకుగాను 400 ఇండ్లు కూల్చివేయాల్సి వస్తుందన్నారు. ఈ ఇళ్ల యాజమానులకు రూ.25కోట్ల పరిహారం ఇవ్వాలని కోరారు. అలాగే లింకు రోడ్ల నిర్మాణాల కోసం రూ.150 కోట్లు ఇవ్వాలని అడిగారు. సాగు, తాగునీటి కోసం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం కొత్తగా జిల్లేడు చౌదరిగూడ మండలాన్ని ఏర్పాటు చేసింది కానీ.. సరైన వసతులు కల్పించలేకపోయిందని ఆరోపించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని సీఎంను కోరారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో 57 గిరిజన తండాలు అభివృద్ధి చేసేందుకు సబ్‌ప్లాన్ నిధులను విడుదల చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, శాసనమండలి విప్ మహేందర్‌రెడ్డి, తెలంగాణ, పట్టణ మరియు మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కలెక్టర్ శశాంక పాల్గొన్నారు.

వర్క్‌బిల్లును వ్యతిరేకిద్దాం

- కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ

వికారాబాద్, అక్టోబరు 11 : వర్క్‌బిల్లును అందరూ వ్యతిరేకించాలని, ఈ విషయంలో కేంద్రం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేటలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ జల్సా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని, ఆయన అందరికీ ఆదర్శనీయమన్నారు. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. పాలస్తీనియన్ల పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయకమని, ఇప్పటికే 40 వేల మంది మృతి చెందారని, అయిన వారు ఎక్కడ వెనుకడుగు వేయకుండా ధైర్యంతో పోరాడుతున్నారన్నారు. ఇజ్రాయిల్ తన ఆగడాలను మానుకోవాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు ఖురాన్ పఠించాలని, ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంఐఎం ముఖ్య నాయకులు, మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.





ఆన్‌లైన్ బెట్టింగులు.. అప్పులు తీర్చలేక చైన్‌స్నాచింగ్‌లు

బంగారు గొలుసు అపహరణ కేసులో నిందితుడి రిమాండ్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 11: ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి అప్పులపాలై చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని మాడ్గుల పోలీసులు అరెస్టుచేసి తులం బంగారం స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు పంపారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో మాడ్గుల సీఐ జగదీశ్‌తో కలిసి ఏసీపీ రాజు వివరాలు వెల్లడించారు. ఈనెల 7న గుర్తుతెలియని దుండగుడు మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధి పాత బ్రాహ్మణపల్లి శివారు ఇర్విన్ వెళ్లేదారిలో ఎర్రమట్టి కోసం వెళ్లిన వృద్ధురాలు బెల్లి లింగమ్మ(70) మెడలోంచి తులం బంగారు గొలుసును లాక్కొని వచ్చిన వాహనంలో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బ్రాహ్మణపల్లి, ఇర్విన్‌లో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి నెంబర్ ప్లేటులేని కోళ్ల సరఫరా చేసే బొలెరో వాహనాన్ని గుర్తించి విచారణ చేపట్టారు. శుక్రవారం మాడ్గుల శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా బొలెరో వాహనం పట్టుబడింది. నిందితుడు నల్లగొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లికి చెందిన సత్తయ్య(32)గా గుర్తించారు. బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేశారు. కాగా, బీటెక్ పూర్తిచేసిన అతను కోళ్ల సరఫరా చేసే బొలెరో వాహనం నడుపుతూ లక్కీ-7 అనే ఆన్‌లైన్ పేకాటకు అలవాటు పడి రెండేళ్లలోనే సుమారు రూ.20 లక్షలు పోగొట్టుకున్నాడు. చెరుకుపల్లిలో ఉన్న పొలాన్ని కూడా అమ్మి అప్పులు తీర్చాడు. చివరకు డబ్బుల కోసం చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. పోలీసులు రిమాండ్‌కు పంపి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

యాచారం, అక్టోబరు 11 : డ్రగ్స్, గంజాయి వాడి మీ జీవితాలను పాడుచేసుకోవద్దని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఏసీపీ కేపీవీ రాజు యువతకు సూచించారు. శుక్రవారం రాత్రి యాచారం మండలం నందివనపర్తి గ్రామంలో డ్రగ్స్, గంజాయి వాడితే కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు యువకులు పోలీసులకు సహకరించాలని తెలిపారు. గ్రామంలో బెల్టుషాపులను నిర్వహించరాదని చెప్పారు. సమావేశంలో యాచారం, ఇబ్రహీంపట్నం సీఐలు శంకర్‌కుమార్, సత్యనారాయణ, జ్ఞానసరస్వతి సేవా సమితి ఫౌండర్ ట్రస్ట్ సదావెంకట్‌రెడ్డి, సభ్యుడు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.


దుస్తులు అందజేస్తున్న చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

కొత్తూర్, అక్టోబరు 11: దసరాను పురస్కరించుకొని స్థానిక మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య కార్మికులకు చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్‌యాదవ్ ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జోలీ రవీందర్, కౌన్సిలర్ మాదారం నర్సింహగౌడ్, నాయకులు మాదారం కృష్ణగౌడ్, వీరమోని శ్రీనివాస్, శ్రవణ్, రాఘవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముడిమ్యాల్‌లో పంచాయతీ సిబ్బందికి..


దుస్తులు పంపిణీ చేస్తున్న కరుణాకర్‌రెడ్డి

చేవెళ్ల, అక్టోబరు 11 : దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా ముడిమ్యాల్ జీపీ సిబ్బందికి చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీజేపీ సీనియర్ నాయకుడు గోనె కరుణాకర్‌రెడ్డి సొంత డబ్బుతో సిబ్బందికి దసరా కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. శుక్రవారం జీపీ కార్యాలయంలో వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకమన్నారు. బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దసరా వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆమనగల్లు, అక్టోబరు 11: విజయానికి సూచిక అయిన విజయదశమి పండుగను ప్రజలంతా శాంతియుతంగా, స్నేహభావంతో ఆనందంగా జరుపుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా గోలి దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత కరుణాకటాక్షాలతో ప్రతీ ఒక్కరికి మంచి జరగాలని, నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. దసరా పండుగ నేపథ్యంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా ప్రజలందరూ సంబురాలు జరుపుకోవాలన్నారు.







దుర్గాదేవికి ఘన పూజలు

దేవీనవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గామాత మహిషాసురమర్దిని రూపంలో దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల దుర్గాదేవికి మహిళలు బోనాలతో తరలి నైవేద్యం సమర్పించారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



షాద్‌నగర్ అర్బన్ : దుర్గామాతను దర్శించుకున్న నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య



కడ్తాల్ : మైసిగండిలో అమ్మవారి పూజల్లో ఫౌండర్ ట్రస్టీ సీరోలి, ఈవో స్నేహలత



చేవెళ్ల : పామెన గ్రామంలో బోనాల ఊరేగింపులో గ్రామస్తులు



తలకొండపల్లి : పూజల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌యాదవ్



మొయినాబాద్ రూరల్ : శ్రీరామ్‌నగర్‌లో పూజలో భక్తులు



యాచారం: కుర్మిద్దలో బోనాలతో తరలిన మహిళలు



ఆమనగల్లు : మంగళపల్లిలో పూజల్లో పాల్గొన్న మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి తదితరులు

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కడ్తాల్, అక్టోబరు 11: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గృహ, వ్యవసాయం, పరిశ్రమలకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని మైసిగండి గ్రామంలోని ఎల్లమ్మ తండా కాలనీలో శుక్రవారం లోవోల్టేజీ నివారణకు ఏఈ నరేందర్ ఆధ్వర్యంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. శ్రీనివాస్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పనులను పరిశీలించారు. విద్యుత్ సమస్యలు, ప్రమాదాలకు చోటు లేకుండ అధికారులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత వరకూ ప్రజలకు ఏ కష్టాలూ ఉండవని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నాయకులు హీరాసింగ్, జవహర్‌లాల్ నాయక్, తుల సీరామ్‌నాయక్, చందన్, గోపాల్, రాజు, హర్య, నరేశ్, వెంకటయ్య, భాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ జరిగే వరకూ పోరాటం



పోలీసుల అదుపులో నర్సింహ

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 11: సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి, ఎస్సీ వర్గీకరణను అమలు చేసే వరకూ ఎమ్మార్పీఎస్ ఉద్యమం ఆగదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ మాదిగ తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కోసం శుక్రవారం కొందుర్గుకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున ముందస్తు జాగ్రత్తగా ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పే మాటలకు చేసే పనులకు ఏమాత్రం పొంతన లేదని విమర్శించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకువచ్చి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



సీఎం సభకు తరలిన నాయకులు

కొత్తూర్, అక్టోబరు 11: షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రారంభానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు స్థానిక కాంగ్రెస్ నాయకులు భారీగా తరలివెళ్లారు. మాజీ ఎంపీపీ జె. వేణుగోపాల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల, మున్సిపాలిటీ శాఖల అధ్యక్షులు హరినాథ్‌రెడ్డి, జె. సుదర్శన్‌గౌడ్, నాయకులు అంబటి ప్రభాకర్, జనిగె జగన్, దేవేందర్‌ముదిరాజ్, కర్రొళ్ల సురేందర్, నర్సింహ, ఎర్రొళ్ల జగన్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న సీనియర్ నాయకుడు శేఖర్‌రెడ్డి

కొత్తూర్, అక్టోబరు 11: షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గు మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించేందుకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హెలీప్యాడ్ వద్ద కొత్తూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డి హెలీక్యాప్టర్ నుంచి కిందకు దిగగానే శేఖర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డిని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సీఎం రేవంత్‌రెడ్డికి పరిచయం చేశారు.

శమీ పూజకు తరలిరావాలి

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 11: విజయదశమిని పురష్కరించుకుని శనివారం సాయంత్రం జానంపేట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే శమి పూజ కార్యక్రమానికి ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ పట్టణాల ప్రజలు హాజరు కావాలని విశ్వహిందూ పరిషత్ క్షేత్ర ప్రముఖ్ బండారి రమేష్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నేడు(శనివారం) సాయంత్రం 4 గంటలకు శివమారుతీ గీతా అయ్యప్ప మందిరం నుంచి శోభాయాత్ర ప్రారంభమై వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు హాజరవుతున్న శమిపూజకు తరలివచ్చి, హిందూ ధర్మ రక్షణకు పాటుపడాలని బండారి రమేష్ పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌ కుట్ర రాజకీయాలు : ఎంపీ

కడ్తాల్‌, అక్టోబరు 11: కాంగ్రెస్‌ ప్రజా పాలనలో ప్రజలు కష్టాల నుంచి వైదొలిగి ఆనందంగా జీవిస్తుంటే ఓర్వలేని బీఆర్‌ఎస్‌ కుట్ర రాజకీయాలు సాగిస్తుందని నాగర్‌కర్నూల్‌ ఎంపీ డాక్టర్‌ మల్లు రవి అన్నారు. ప్రజల తిరస్కరణకుగురై అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్‌ నేతల్లో మార్పు రాలేదన్నారు. మండలంలోని మైసిగండిలో శుక్రవారం రవి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ నాయకులు మల్లు రవికి స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. రవి మాట్లాడుతూ రుణమాఫీతో రైతులు, కొలువులు దొరికి యువత, సకాలంలో జీతాలు అంది ఉద్యోగులు, ప్రభుత్వ తోడ్పాటుతో జీవనప్రమాణాలు పెరిగి ప్రజలు ఆనందంగా ఉంటే జీర్ణించుకోలేని విపక్షాలు విషరాజకీయాలు సాగిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్‌ జిల్లా నాయకుడు జవహర్‌లాల్‌ నాయక్‌, యూత్‌ కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడు హీరాసింగ్‌, నాయకులు దశరథ్‌నాయక్‌, జగన్‌నాయక్‌, పత్యానాయక్‌, రమేశ్‌నాయక్‌, చందునాయక్‌ తదితరులు ఉన్నారు.



శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులతో మల్లు రవి

ముఖ్యమంత్రికి మధుసూదన్‌రెడ్డి శుభాకాంక్షలు



షాబాద్‌, అక్టోబరు 11 : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా షాబాద్‌ మండలానికి చెందిన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని నియమించడంతో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన కలిసి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకముంచి పదవి కట్టబెట్టిన ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. జిల్లాలోని గంథ్రాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. సీఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పొన్న వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

క్రికెట్‌ పోటీలు ప్రారంభం

ఆమనగల్లు, అక్టోబరు 11: మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలో శుక్రవారం పోలెపల్లి ప్రీమియర్‌ లీగ్‌ పోటీలు నిర్వహించారు. జిల్లా యువజన నాయకుడు దారెడ్డి అభినవ్‌ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో యువకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక నాయకులతో కలిసి అభినవ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించాలని వారు కోరారు. రామకృష్ణ, కిరణ్‌, శ్రీను, మహేందర్‌, నరేశ్‌, మల్లేశ్‌, యశ్వంత్‌, నిఖిల్‌, నవీన్‌, శివ, గోపి, వెంకట్‌ , చంటి, సాయి, వంశీ, ప్రభాష్‌, ఆకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న అభినవ్‌రెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కందుకూరు, అక్టోబరు 11: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒ ఒక్కరు బాధ్యతాయుతంగా భావించి విరివిగా మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్‌ జిల్లా వైస్‌ గవర్నర్‌ జి.మహేంద్రకుమార్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం కందుకూరు లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు ఎస్‌.విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో మొక్కలు నాటారు. ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చెట్లను నరికి వేయడం వల్ల రానున్న రోజుల్లో పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశముందన్నారు. ఈ సందర్భంగా 100 మొక్కలు నాటినట్లు విఠల్‌రెడ్డి తెలిపారు. లయన్స్‌ క్లబ్‌ కోశాధికారి కుంచకూరి వెంకటేశ్వర్లు గుప్తా, రవికుమార్‌, పెంటయ్య తదితరులున్నారు.



మొక్కలు నాటుతున్న మహేంద్రకుమార్‌ రెడ్డి

బతుకమ్మ సంబురాలు

కొత్తూర్‌, అక్టోబరు 11: మున్సిపాలిటీలోని మందోని మైసమ్మ ఆలయం ప్రాంగణంలో కౌన్సిలర్‌ హేమా దేవేందర్‌ ముదిరాజ్‌ ఆధ్వర్యంలో మహిళలు సద్దుల బతుకమ్మ సంబురాలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు పెద్దఎత్తున బతుకమ్మలతో తరలివచ్చి ఆటపాటలతో సంబురాలు నిర్వహించారు.

CHANGE OF NAME

It is for general information that I, BHOOMIKA NEEL PATEL Alias C BHOOMIKA D/o CHUNILAL MOHANBHAI LODARIYA and EX. W/o NEEL HARISHKUMAR PATEL, R/o 501 5th Floor Plot No-36, Sai Akhil Arcade, Manikonda, Lakshmi Swamy Nagar, K.V. Rangareddy, Telangana-500089, declare that I got divorce from my Ex.husband. And name of my father has been wrongly written CHUNILAL PATEL CHANNIYARA in my passport, the Actual Name of my Father is CHUNILAL MOHANBHAI LODARIYA. Also i have changed my name to BHOOMIKA CHUNILAL LODARIYA.